సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 30 । జూన్ । 2025



నష్టాల ఊబిలో రొయ్య రైతు

ఆక్వా రైతులను ప్రతికూల వాతావరణం వెంటాడుతోంది. వేల ఎకరాల్లో సాగులో ఉన్న రొయ్యలు వ్యాధుల బారిన పడుతున్నాయి. 8లో



వైఎస్సార్‌సీపీలోకి చేరిక

నూజివీడు మండలం నుంకొల్లులో టీడీపీ నుంచి 10 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. 8లో



నేడు జాబ్‌మేళా

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. 8లో

సిఫార్సుల బదిలీలలు

సచివాలయ ఉద్యోగుల గగ్గోలు

- బదిలీల్లో ఎమ్మెల్యేల పెత్తనం
- స్థానిక నాయకుల సిఫార్సుల మేరకే లేఖలు
- కూటమి నేతల చుట్టూ ఉద్యోగుల ప్రదక్షిణలు
- ర్యాంకుల ఆధారంగా బదిలీలు చేపట్టాలని డిమాండ్
- సీనియార్టీ జాబితా లేకపోవడంపై ఆగ్రహం



పారదర్శక బదిలీల కోసం నినాదాలు చేస్తున్న గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ సెక్రటరీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : రాష్ట్రంలో బదిలీలు అంటేనే ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం పలు శాఖల్లో బదిలీలకు కౌన్సెలింగ్‌లు నిర్వహించింది. అయితే ఎక్కడా సజావుగా సాగలేదు. ఆచరణ సాధ్యం కాని నిబంధనలతో ఉద్యోగులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి. తాజాగా గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ సెక్రటరీలు సైతం బదిలీల కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ధర్నా చేయడం ప్రభుత్వ విధానానికి అద్దం పడుతోంది. వీరి బదిలీల్లో ఎమ్మెల్యేలు పెత్తనం చేయాలని చూడటంతో ఆగ్రహ జ్వాలలు ఎగసిపడుతున్నాయి.

స్థానిక నాయకుల చెప్పుచేతల్లో పెట్టేలా..

గ్రామ సచివాలయాల్లో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ సెక్రటరీల బదిలీలకు సంబంధించి ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలకు ప్రాధాన్యమివ్వాలని అధికారులకు ప్రభుత్వ పెద్దలు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఎమ్మెల్యేలు సచివాలయ ఉద్యోగులు పనిచేసే ప్రాంతంలోని స్థానిక కూటమి నాయకుని సిఫార్సు ఉంటేనే లేఖలు ఇస్తున్నట్టు సమాచారం. స్థానిక నాయకుల సిఫార్సులు తీసుకుంటే ఆ తర్వాత తమ ఉద్యోగాలు ఆ స్థానిక నాయకుల వద్దే చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, దీని వల్ల అర్హులైన లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదముందని సెక్రటరీలు అంటున్నారు. అదీ కాక ఎంత మందికి స్థానిక నాయకులతో సత్సంబంధాలు ఉంటాయని, అర్హత ఉన్న ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విధులకు దూరం.. ప్రదక్షిణల పర్వం

సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ సెక్రటరీలు స్థానిక కూటమి నాయకుల ఇళ్ల వద్ద ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ క్రమంలో వారి విధులకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు ఉద్యోగులకు స్థానిక నాయకులతో నేరుగా సంబంధాలు ఉండటంతో వారు తొలి ప్రాధాన్యతగా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు అందుకున్నారు. మరికొందరు స్థానిక నాయకులతో బంధుత్వమో, స్నేహమో ఉన్న వారిని వెంటబెట్టుకుని వారి చుట్టూ తిరిగి ఇప్పటికే ఎమ్మెల్యేల లేఖలను సంపాదించి సాంఘిక సంక్షేమ అధికారులకు పంపినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే 19 మంది అభ్యర్థులతో కూడిన సిఫార్సు లేఖను జిల్లా పంచాయతీ అధికారికి పంపినట్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ర్యాంకులు పట్టించుకోరా?

నియమ నిబంధనలు కాదని బదిలీల్లో సిఫార్సులపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము సాధించిన ర్యాంకుల ఆధారంగా ఉద్యోగాలు ఎలా కేటాయించారో అలాగే బదిలీలు చేపట్టాలని, జాబితాలు సిద్ధం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే తాము ర్యాంకులు సాధించి ఏం ప్రయోజనమని వాపోతున్నారు. ప్రతిభను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేపట్టడానికి ప్రయత్నించడం దారుణమని ఆవేదన చెందుతున్నారు.

సీనియార్టీ జాబితా లేకుండానే..

ఏ శాఖలో అయినా సీనియార్టీ జాబితా ప్రదర్శించి దాని ఆధారంగానే బదిలీలు చేస్తారని, అయితే సచివాలయ ఉద్యోగుల విషయంలో అలా ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. సీనియార్టీ జాబితా రూపొందించకుండా తమను మూడు ప్రాంతాలు కోరుకోమని, వాటిని ఫారంలో నింపి వెళ్లిపోవాలని సూచించడం నిబంధనలకు విరుద్ధమని మండిపడుతున్నారు. తాము కోరుకున్న మూడు ప్రాంతాలనే మరో పది మంది కోరుకుంటే తమకు ఎక్కడి స్థానాలు కేటాయిస్తారని ప్రశ్నిస్తున్నారు. అలాగే బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వాల్సిన అంధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, స్పౌజ్ కేటగిరీల్లో కూడా జాబితా రూపొందించకుండా తమతో ఫారాలు నింపించుకుని ఇష్టానుసారంగా బదిలీలు చేస్తే తమ కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు.

పారదర్శకంగా చేపట్టాలి



గ్రామ సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలకు ప్రాధాన్యమిస్తే అర్హులు నష్టపోతారు. బదిలీలకు సీనియార్టీ జాబితా తయారు చేయకుండా అధికారులు ఇష్టమొచ్చిన చోటుకు బదిలీ చేస్తామనడం నిబంధనలకు విరుద్ధం. సొంత మండలాల్లోకి బదిలీలు చేయమనే నిబంధన అమలు చేస్తున్నప్పుడు ఇతర నిబంధనలు కూడా అమలు చేయాలి.

– కె.అజయ్‌బాబు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మార్గదర్శకాలు మర్చిపోయారు



ప్రభుత్వం బదిలీలపై జీఓ ఇచ్చి మార్గదర్శకాలు మర్చిపోయింది. గత 30, 40 ఏళ్లలో ఇలాంటి బదిలీలు చూడలేదు. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాల్లో బదిలీలు ముగిసినట్టు ప్రచారం జరుగుతుండటం సెక్రటరీలను కలవరపెడుతోంది. ఎమ్మెల్యేల లేఖలకే ప్రాధానమిస్తే ఇక బదిలీలకు కౌన్సెలింగ్ ఎందుకు. లేఖలు పొందిన వారు మినహా మిగిలిన వారంతా ఆందోళనలో ఉన్నారు.

– ఈ.నరేష్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ సెక్రటరీ

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం



సబ్‌జైలులో ఆహారాన్ని పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

చింతలపూడి: చింతలపూడి సబ్ జైలును ఆదివారం ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.శ్రీదేవి సందర్శించారు. జైలులో ముద్దాయిలకు అందిస్తున్న ఆహారం, వసతి సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. హింసా మార్గాన్ని వీడాలని, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. వంటశాల, స్టోర్ రూమును తనిఖీ చేసి ఆహారాన్ని పరిశీలించారు. సబ్‌జైలు ప్రాంగణంలోని ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు, సబ్ జైలు సూపరింటెండెంట్ కృపానందం, ప్యానల్ లాయర్ టోకూరి వెంకటేష్, పీఎల్‌వీటీవీఎస్ రాజు, సీఐ క్రాంతికుమార్, ఎస్సై సతీష్‌కుమార్ ఉన్నారు.

నేడు పీజీఆర్‌ఎస్

భీమవరం (ప్రకాశంచౌక్) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని సోమవారం జిల్లాలోని కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల స్థాయిల్లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. ప్రజల సమీపంలోని కార్యాలయానికి వెళ్లి అర్జీలు సమర్పించవచ్చన్నారు.

అమలుకాని విద్యాహక్కు చట్టం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యాహక్కు చట్టం ప్రైవేట్ పాఠశాలల్లో పక్కాగా అమలయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాల్సి ఉండగా.. జిల్లాలో పూర్తిస్థాయిలో అమలైన దాఖలాలు లేవని పేర్కొన్నారు. కొన్ని పాఠశాలల్లో పిల్లలను చేర్పించుకుంటున్నా వివక్ష చూపుతున్నారని, తల్లిదండ్రుల నుంచి అనధికారికంగా రుసుములు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఫీజుల విషయంలో ఇబ్బందులు పెడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయని, జిల్లా విద్యాశాఖాధికారులు సమగ్ర విచారణ జరపాలని కోరారు.

రాట్నాలమ్మకు విశేష పూజలు

పెదవేగి: పెదవేగి మండలం రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలో విశేష పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి పూజా రుసుముల ద్వారా రూ.41,100, విరాళాల రూపంలో రూ.1,401, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.29,805, పులిహోర అమ్మకం ద్వారా రూ.1,380, ఫొటోల విక్రయం ద్వారా రూ.4,165 మొత్తం రూ. 77,851 ఆదాయం సమకూరినట్టు ఈఓ ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

భీమవరం: ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించి 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో గుత్తుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పెండింగ్, 11వ పీఆర్సీ, సరెండర్ లీవ్, ఏపీజీఎల్ఐ బకాయిలు చెల్లించకపోవడంతో టీచర్లు నష్టపోతున్నారన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో డీఎస్సీ అభ్యర్థులు వచ్చే వరకూ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలన్నారు. 2008, 1998 ఎంటీఎస్ టీచర్లకు 62 ఏళ్ల వయో పరిమితిని పెంచి వారిని రెగ్యులర్ విధానంలో నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కేవీ రామచంద్రరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.దావీదు, జిల్లా ఆర్థిక కార్యదర్శి పీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు

ఉండి: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు వచ్చేనెల 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు తెలిపారు. దరఖాస్తు అనంతరం సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలన్నారు. వీరు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులని తెలిపారు. టెన్త్ ఫెయిలైన విద్యార్థుల కోసం వెల్డర్ ట్రేడ్ అందుబాటులో ఉందన్నారు. మరిన్ని వివరాలకు 08816 297093, 9676099988 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

డీఎస్సీ పరీక్షలకు 94 శాతం హాజరు



భీమవరం: జిల్లాలోని రెండు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షకు 94 శాతం అభ్యర్థులు హాజరయ్యారని డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 210 మందికి 199 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

ఏలూరు జిల్లాలో 455 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరులో ఆదివారం జరిగిన డీఎస్సీ పరీక్షలకు 455 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 100 మందికి 83 మంది, మధ్యాహ్నం 101 మందికి 94 మంది హాజరయ్యారు. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 115 మందికి 95 మంది, మధ్యాహ్నం 201 మందికి 183 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతం



నరసాపురం: దీక్షలు చేస్తున్న కార్మికులు



తాడేపల్లిగూడెం (టీఓసీ): దీక్షా శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు



తణుకు అర్బన్ : దీక్షలు కొనసాగిస్తున్న దృశ్యం

నరసాపురం/తణుకు అర్బన్/తాడేపల్లిగూడెం (టీఓసీ): మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్‌లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులు సమ్మెను ఉధృతం చేశారు. ఆదివారం నుంచి వీధి దీపాల నిర్వహణ, మంచినీటి సరఫరా పనులను సైతం బహిష్కరించారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకూ ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు. నరసాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న తమకు న్యాయం చేయడంలో ప్రభుత్వం తాత్సారం చేయడం దారుణమన్నారు. కోటిపల్లి కాశీ, ఎం.రత్నం, సీహెచ్ సత్యనారాయణ, ఫణి నాయకత్వం వహించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

తణుకు అర్బన్: తణుకులో కార్మికుల దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం శిబిరంలో జేఏసీ అధ్యక్షుడు ఉండ్రాజవరపు శ్రీను, కార్యదర్శి గెల్లా విజయ్‌కుమార్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనాలు చెల్లించే విధానం అమల్లోకి రావాలని కోరారు. 25 ఏళ్లకు పైబడి విధుల్లో ఉంటున్నా రూ. 13 వేల వేతనాలే అమల్లో ఉండటం బాధాకరమన్నారు. నాయకులు దాసరి సత్యనారాయణ, రాపాక సురేష్, ప్రసాద్, రాపాక రవి తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో ఏడో రోజుకు చేరిన దీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో కార్మికుల దీక్షలు ఆదివారం ఏడో రోజూ కొనసాగాయి. జేఏసీ నాయకులు మద్రిపూడి సతీష్ కుమార్, అవిడి కుమార్, ఎర్రంశెట్టి నాగేశ్వరరావు, బండారు శ్రీను, అడ్డాల చలపతి, ప్రత్తి రమేష్ మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకుంటే సమ్మె మరింత ఉధృతం చేస్తామని అన్నారు.

సాగు..జాగు



పెనుమంట్ర మండలంలో వర్షం నీరుపై సిద్ధం చేసిన నారుమడి

ఖరీఫ్.. లేదు రిలీఫ్

- జిల్లాలో నత్తనడకన తొలకరి పనులు
- జూన్ ముగుస్తున్నా జోరందుకోని నారుమడులు
- సర్కారు నుంచి కొరవడిన సహకారం
- సాగునీటి సరఫరాలో జాప్యం
- రూ.250 కోట్ల మేర ధాన్యం బకాయిలు
- జిల్లాలో 2.08 లక్షల ఎకరాల్లో సార్వా సాగు

సాక్షి, భీమవరం : జిల్లాలో ఖరీఫ్ సాగు నత్తను తలపిస్తోంది. ధాన్యం బకాయిలు విడుదల కాకపోవడం, పంట పెట్టుబడులకు సర్కారు నుంచి సాయం కొరవడటం, శివారు భూములకు సాగునీరు అందకపోవడం తదితర కారణాలతో జూన్ ముగిసిపోతున్నా తొలకరి పనులు ఇంకా జోరందుకోలేదు.

జిల్లాలో 2.08 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగనుండగా 50 శాతం విస్తీర్ణంలో ఎంటీయూ 1318 రకం, 25 శాతం విస్తీర్ణంలో ఎంటీయూ 7029 రకం, మిగిలిన విస్తీర్ణంలో ఎంటీయూ 1293, పీఎల్ఏ 1100 తదితర రకాలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా. నవంబరు చివరిలో వచ్చే తుపానుల బారిన పడకుండా ముందుగానే పంటను ఒబ్బిడి చేసుకునే దిశగా గతంలో జూలై 15లోగా నాట్లు పూర్తిచేసే లక్ష్యంతో పనులు వేగవంతం చేసేవారు. జూన్ నెలాఖరుకు నారుమడులు వేయడం చాలా వరకు పూర్తికావడంతో పాటు ముందుగా వరి కోతలు జరిగే తాడేపల్లిగూడెం ప్రాంతంలో నాట్లు జోరందుకునేవి. ఈ సీజన్‌లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. జూన్ నెల ముగిసిపోతున్నా ఇంకా పనులు ముమ్మరం కావడం లేదు. ఇప్పటివరకు 3,120 ఎకరాలకు సంబంధించి నారుమడులు వేయగా, 2,680 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి.



ఈ ఫొటోను గమనించారా? పాలకోడేరు మండలం మోగల్లులోని రేలంగి చానల్ దుస్థితి. తణుకు రూరల్ మండపాక నుంచి అత్తిలి, ఇరగవరం మండలాల మీదుగా పాలకోడేరు మండలం మోగల్లు వరకు దాదాపు 27 కి.మీ పరిధిలో వేల ఎకరాల ఆయకట్టుకు ఈ రేలంగి చానల్ ద్వారా సాగునీరు అందుతుంది. ముందస్తు సాగు కోసం పశ్చిమ డెల్టాకు జూన్ 1నే సాగునీటిని విడుదల చేసినట్టు ప్రభుత్వం ప్రకటించగా ఇప్పటికీ శివార్లకు సాగు నీరందని దుస్థితికి ఈ చిత్రం అద్దం పడుతుంది. పూర్తిస్థాయిలో సాగు నీరందక కాలువ పరిధిలోని తొలకరి పనులకు ఆటంకం కలుగుతోంది.

విడుదల కాని ధాన్యం సొమ్ములు

ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే చెల్లింపులు చేస్తున్నట్టు కూటమి ప్రభుత్వం చెబుతుండగా నెల రోజులైనా సొమ్ములు చేతికందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. రబీ సీజన్‌లో జిల్లాలో దాదాపు 77 వేల మంది రైతుల నుంచి రూ.1,650 కోట్ల విలువైన 7.17 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. వీటిలో రూ.1,360 కోట్లు రైతుల ఖాతాలకు జమచేయగా రూ.250 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. ధాన్యం విక్రయించి నెల రోజులు దాటినా ప్రభుత్వం నుంచి బకాయిలు రాలేదని రైతులు వాపోతున్నారు. తొలకరి పెట్టుబడుల కోసం చేతిలో సొమ్ముల్లేక అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

ఆదుకోని 'అన్నదాత సుఖీభవ'

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలకరి ప్రారంభంలోనే రైతు భరోసాగా రూ.7,500 మొత్తాన్ని పెట్టుబడి సాయంగా అందించారు. విత్తనాలు, నారుమడుల తయారీ, ఎరువుల కొనుగోలుకు రైతులు అప్పులు చేయాల్సిన పని ఉండేది కాదు. తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయంగా ఏటా రూ.20 వేల చొప్పున అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు మొదటి ఏడాది సాయానికి ఎగనామం పెట్టారు. ఈ ఏడాదీ సాయం విడుదలపై స్పష్టత లేదు. దీంతో రైతులు పంట పెట్టుబడులకు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

సాగునీరు.. అందని తీరు

జిల్లాలో 11 ప్రధాన పంట కాలువల ద్వారా ఆయకట్టుకు సాగునీటి సరఫరా జరుగుతోంది. క్లోజర్‌లో భాగంగా సుమారు రూ.77 కోట్ల విలువైన 150 పనులతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. వీటిలో కొన్నింటికి అనుమతులు రాగా సకాలంలో పనులు పూర్తికాకపోవడం తొలకరి పనులపై ప్రభావం చూపుతోంది. ముందస్తు కోసమంటూ జూన్ 1న కాలువలకు నీరు విడుదల చేస్తున్నట్టు ప్రకటించినా క్లోజర్ పనులు పూర్తికాకపోవడంతో ఇప్పటికీ పలుచోట్ల శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. కొన్ని ప్రాంతాల్లో తొలకరి వర్షాలపైనే సాగుకు సిద్ధమైన పరిస్థితులు ఉన్నాయి.

పేగు బంధం కాదన్నా.. మానవత్వం చాటి..

వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించిన ఆశ్రమ నిర్వాహకుడు



వృద్ధురాలు శకుంతలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న శేఖర్

జంగారెడ్డిగూడెం: పేగు బందం కానరాలేదు. ఒడిదుడుకులు ఎదుర్కొని కుటుంబాన్ని నిలబెట్టిన వృద్ధురాలిని అనాథగా వదిలేశారు. ఆమె ఆఖరి మజిలీలోనూ పట్టించుకోకపోగా మానవత్వం చాటుతూ ఆశ్రమ నిర్వాహకుడు అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి.. కోడూరి శకుంతల అనే వృద్ధురాలిని నాలుగేళ్ల క్రితం జంగారెడ్డిగూడెంలోని సీతామహాలక్ష్మి వృద్ధుల, వికలాంగుల, అనాథ ఆశ్రమంలో కుటుంబసభ్యులు చేర్పించారు. అప్పటి నుంచి ఆశ్రమంలోనే ఆమె జీవనం సాగిస్తోంది. ఇటీవల శకుంతల అనారోగ్యం పాలుకాగా కుటుంబసభ్యులు పట్టించుకోలేదు. దీంతో ఆశ్రమ నిర్వాహకుడు జయవరపు శేఖర్ ఆమెను ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. ఈ విషయాన్ని ఆమె కుటుంబసభ్యులకు తెలియజేసినా స్పందించలేదు. చివరకు చికిత్స పొందుతూ శకుంతల (94) ఆదివారం కన్నుమూశారు. ఆమెకు అంత్యక్రియలు నిర్వహిస్తామని అప్పటివరకు చెప్పిన కుటుంబసభ్యులు చివరి నిమిషంలో ముఖం చాటేశారు. దీంతో ఆశ్రమ నిర్వాహకుడు శేఖర్ అన్నీ తానై వృద్ధురాలి అంత్యక్రియలను కుటుంబసభ్యులు, బంధువుల మధ్య నిర్వహించి సేవాతత్పరతను చాటారు.

'జన సురక్ష'పై ప్రచారం

ఏలూరు(మెట్రో): జన సురక్ష పథకాల ద్వారా సామాన్యులకు భద్రత కల్పిస్తున్నట్టు లీడ్ బ్యాంక్ మేనేజర్ డి.నీలాద్రి తెలిపారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి సహకారంతో ఏలూరు జిల్లావ్యాప్తంగా మూడు నెలల పాటు పథకాల నమోదు కార్యక్రమంపై ప్రచారం నిర్వహించనున్నామన్నారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.1,000 నుంచి రూ.5,000 వరకు పెన్షన్ లభిస్తుందన్నారు. పీఎం సురక్ష బీమా యోజనలో చేరితే రూ.2 లక్షల వరకూ ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన కింద రూ.2 లక్షల బీమా కవరేజీ ఉంటుందన్నారు. బ్యాంకు మిత్ర ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను సులభంగా పొందే అవకాశం ఉందన్నారు.

క్లుప్తంగా

వరాహావతారంలో జగన్నాథుడు



వరాహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణు గోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం జగన్నాథుడు శ్రీ వరాహావతారంలో సాక్షాత్కరించారు. జగన్నాథ రథ యాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అందులో భాగంగా శంకు చక్రాలను ధరించి, అమ్మవార్లతో ఆశీనులై ఉన్న స్వామివారి అలంకారం భక్తులకు కనువిందు చేసింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెద్దింట్లమ్మా.. చల్లంగా చూడమ్మా



కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తులు

కైకలూరు: పెద్దింట్లమ్మా.. నీ ఆశీస్సులు అందించమ్మా అంటూ భక్తులు అమ్మవారిని ఆర్తితో వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మను సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. పవిత్ర కోనేరులో స్నానాలు చేసి వేడి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఒక్క ఆదివారం ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండన, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డు ప్రసాదం, గదుల అద్దెలు, అమ్మవారి చిత్రపటాలు, వాహన పూజలు, విరాళాల ద్వారా రూ.68,010 ఆదాయం వచ్చిందని తెలిపారు.

జూదరుల అరెస్టు

దెందులూరు: దెందులూరులో పేకాట రాయుళ్లపై పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి దెందులూరు యందంవారి వీధి డంపింగ్ యార్డ్ వద్ద పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.6100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

నష్టాల ఊబిలో రొయ్య రైతు

- వ్యాధుల విజృంభణతో అర్ధాంతరంగా పట్టేస్తున్న రైతులు
- వ్యాపారులు సిండికేటు మారి గిట్టుబాటు ధర ఇవ్వని వైనం



పట్టేసిన కౌంట్‌కు రాని రొయ్యలు



వ్యాధి సోకి చనిపోయిన రొయ్యలు

గణపవరం: ఆక్వా రైతులను ప్రతికూల వాతావరణం ఇంకా వెంటాడుతోంది. దీంతో వేల ఎకరాలలో సాగులో ఉన్న రొయ్యలు వ్యాధుల బారిన పడుతున్నాయి. ఈ నెలారంభం నుంచి ప్రతికూల వాతావరణ ప్రభావంతో రొయ్యలకు వైట్‌స్పాట్ (తెల్ల మచ్చ) వ్యాధితో పాటు ఈహెచ్‌పీ వ్యాధి కూడా తోడవడంతో రొయ్యలు మృత్యువాత పడ్డాయి. కొద్దిరోజులుగా ఉష్ణోగ్రతల్లో భారీ హెచ్చు తగ్గుల వల్ల రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది ఆరంభం నుంచి రొయ్యసాగు అంతంత మాత్రంగానే ఉంది. గత జనవరిలో చెరువులలో సీడ్ వేసిన రైతుల్లో 80 శాతం కౌంట్‌కు రాకుండానే పట్టేశారు. దీంతో రైతులు నష్టాల పాలయ్యారు.

మే, జూన్ నెలల్లో ప్రతికూల వాతావరణం

ఈ వేసవిలో రైతుల అంచనాలు తారుమారయ్యాయి. మే నెలలోనే వర్షాలు కురిసి వాతావరణం చల్లబడిపోయింది. దీనితో రొయ్యలకు రకరకాల వైరస్‌లు సోకడంతో అర్ధాంతరంగా పట్టేసి అయినకాడికి అమ్ముకున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో సుమారు పదివేల ఎకరాలలో రొయ్య సాగు చేయగా సుమారు 8వేల ఎకరాలలో కనీసం 100 కౌంట్‌కు రాకుండానే పట్టేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆక్వాను ఆదుకుంటామని ఊదరగొట్టారు. రొయ్యలకు కనీస ధరలు ప్రకటించింది. మేతల ధరలు కూడా తగ్గిస్తున్నట్లు హంగామా చేశారు. ఇవేవీ రొయ్య రైతులకు అక్కరకు రాలేదు. ప్రభుత్వం ప్రకటించిన ధరకు వ్యాపారులు కొనుగోలు చేసిన దాఖలా లేదు. గత్యంతరం లేక అడిగిన ధరకే అమ్ముకోక తప్పని పరిస్థితి. 100 కౌంట్ రొయ్య రూ.220కు కొనాల్సి ఉన్నా రూ.200 లోపే కొనుగోలు చేస్తున్నారు. అన్ని రకాల కౌంట్ ధరలోనూ రూ.50 నుంచి రూ.70 వరకూ తగ్గించేశారు.

వైరస్ విజృంభణతో రైతు కుదేలు

ఈ ఏడాది వ్యాధులు విజృభించి ఆక్వా సాగును కుదేలు చేశాయి. ఏదైనా ఆయకట్టులో ఒక చెరువుకు వైరస్ వస్తే క్షణాల్లో ఆయకట్టులో మొత్తం చెరువులకు వ్యాపిస్తుంది. తక్షణం పట్టుబడి చేయకపోతే వ్యాధి సోకిన రొయ్యతోపాటు ఆరోగ్యంగా ఉన్న రొయ్యలూ దక్కకుండా పోతాయి. దీంతో రైతులంతా రొయ్యలు పట్టేసి అడిగిన ధరకు అమ్ముకున్నారు. గత పది రోజుల్లో గణపవరం, నిడమర్రు మండలాలలో వందల ఎకరాలలో చెరువులు ఖాళీ అయ్యాయి. వ్యాధులకు తోడు ఎడాపెడా విద్యుత్ కోతల కారణంగా ఏరియేటర్లు తిప్పడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



రెండేళ్లగా రొయ్యల సాగు రైతులను కుదేలు చేస్తుంది. నాణ్యత లేని సీడ్, వ్యాధుల వ్యాప్తితో ఆక్వా రైతులు నష్టాల పాలవుతున్నారు. ప్రభుత్వం హడావుడిగా రొయ్యలకు ధర నిర్ణయించినా తర్వాత పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనడంలేదు. ఒక పక్క లీజులు, నిర్వహణ ఖర్చులు, విద్యుత్ బిల్లులు, డీజిల్ వినియోగం విపరీతంగా పెరిగిపోయాయి. ఒకవేళ పంట బాగుంటే వ్యాపారులు సిండికేట్‌గా తయారై రైతుకు గిట్టుబాటు ధర ఇవ్వడంలేదు.

సంకు నాని, రొయ్య రైతు

నాణ్యమైన సీడ్ వేయాలి



ప్రస్తుత వాతావరణంలో వైరస్ వ్యాధులు తీవ్రంగా వ్యాప్తి చెందుతున్నాయి. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రొయ్య సాగు ఆరంభంలోనే సర్టిఫైడ్ హేచరీస్ నుంచి నాణ్యమైన సీడ్ తెచ్చుకోవాలి. వైట్‌స్పాట్, ఈహెచ్‌పీ పరీక్షలు చేయించుకున్నాకే సీడ్ తీసుకోవాలి. సక్రమ యాజమాన్య పద్ధతులతో కొంతవరకూ వ్యాధులు రాకుండా చూడవచ్చు. వైట్‌స్పాట్ వస్తే ఇమ్యూనిటీ పెంచడానికి విటమిన్ సీ, ప్రోబయోటిక్స్ వాడాలి. ఈహెచ్‌పీ వస్తే వెంటనే పట్టుబడి చేసుకోవాలి.

– శివరామకృష్ణ, ఎఫ్‌డీవో, గణపవరం

ఏలూరులో భారీ వర్షం



సెయింట్ థెరిస్సా పాఠశాల వద్ద మునిగిన రోడ్డు



ఎన్‌ఆర్‌పేటలో వర్షం నీటిలో వీధి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సాయంత్రం 7 గంటల నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా మారింది. ఈదురుగాలులతో కూడిన వర్షం ప్రారంభం కావడంతో ప్రజా జీవనం స్తంభించింది. ఆదివారం కావడంతో జన సంచారం పెద్దగా లేకపోయినా కుటుంబాలతో కలిసి సరదాగా బయటకు వచ్చిన వారు వర్షంలో ఇరుక్కుపోయారు. ఉదయం ఎండ వేడిమితో ఇబ్బంది పడ్డ ప్రజలకు ఈ భారీ వర్షంతో స్వాంతన చేకూరింది. భారీ వర్షం కారణంగా రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక

పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



సుంకొల్లులో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. మండలంలోని సుంకొల్లులో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో టీడీపీ నుంచి 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో ప్రతాప్ అప్పారావు సమక్షంలో చేరాయి. వారికి ప్రతాప్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన కొనకాల సీతారామయ్య, కొనకాల అజయ్, బుడిపూడి శ్రీనివాసరావు, బుడిపూడి శ్రీరాములు, పలగాని జమలయ్య, కొనకాల రమేష్, కొనకాల రామకోటేశ్వరరావు, వలిపి గోపి, లంకా పెద బాబు, గుడివాడ ఏసు లు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేశానని చెప్తున్నప్పటికీ వాస్తవంగా తూతూ మంత్రంగా అమలు చేసిందని విమర్శించారు. ఒకటో తరగతి విద్యార్థులు, పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు ఇవ్వకుండా ఎగ్గొట్టిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈనెల 20న అమలు చేస్తున్నామని, రైతుల అకౌంట్‌లో డబ్బులు వేస్తున్నామని చెప్పిన ప్రభుత్వం ఇంత వరకు అమలు చేయలేదన్నారు. కౌలు రైతులకు ఈ పథకం లేదని చెబుతూ ప్రభుత్వం కోతలు పెడుతోందన్నారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేలు జీతం ఇస్తానని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చాక వారిని తొలగించారన్నారు. ఇంటింటికి రేషన్ సరుకులను అందిస్తున్న రేషన్ వాహనాలను ప్రభుత్వం తొలగించి ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టిందన్నారు. కొన్ని చోట్ల మూడు, నాలుగు కిలోమీటర్లు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఎక్కడని, మహిళలకు ఉచిత బస్సు ఎప్పుడని ప్రతాప్ నిలదీశారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు క్యాలండర్‌ను ప్రకటించి దాని ప్రకారం చెప్పిన తేదీకి పథకాన్ని అమలు చేశారన్నారు. ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశాం గాని ప్రజలను ఇంత దారుణంగా మోసం చేసే ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదన్నారు. రాష్ట్రంలో ఈరోజు ఎన్నికలు నిర్వహిస్తే కూటమి పార్టీలను రాష్ట్ర ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. మట్టిని, ఇసుకను దోచేస్తున్నారన్నారు. తాను ఓడినా, గెలిచినా నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమానికి ప్రతాప్ అప్పారావును బైక్ ర్యాలీతో గ్రామంలోకి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో సర్పంచి దుడ్డు నాగమల్లేశ్వరరావు, జడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, నాయకులు గబ్బర్, బసవా వినయ్, కంచర్ల లవకుమార్, బసవా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కైకలూరులో జాబ్ మేళా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కై కలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎస్.జితేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో సుమారు 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 705 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. జాబ్ మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, ఎంబీఏ, పీజీ, బీటెక్ వంటి విద్యార్హతలు ఉండి 18–35 సంవత్సరాల మధ్య వయసు వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9676140314, 6281119575, 9652503799 నెంబర్లలో లేదా (9988853335 - టోల్ (ఫ్రీ) నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరు కావాలని సూచించారు.

ప్రమాదాలకు ఎదురెళ్లి..



ఆరుగొలను - ప్రత్తిపాడు రైల్వే లెవల్ క్రాసింగ్ మూసినా దాటేందుకు యత్నం



గేటు లోపల ప్రమాదకర స్థితిలో వాహనదారుడు

తాడేపల్లిగూడెం రూరల్: వాహనదారులు తమ ప్రాణాలు పణంగా పెట్టి రైల్వే లెవల్ క్రాసింగ్‌లు దాటుతున్నారు. తాడేపల్లిగూడెం మండలంలో ప్రత్తిపాడు, మారంపల్లి, నవాబుపాలెం వద్ద రైల్వే లెవల్ క్రాసింగ్‌లున్నాయి. రైలు రాకపోకలను గుర్తించిన వెంటనే సంబంధిత సిబ్బంది లెవల్ క్రాసింగ్‌ల వద్ద ముందస్తుగానే గేట్లను మూసివేస్తుంటారు. కొందరు వాహనదారులు మాత్రం అడ్డదిడ్డంగా రాకపోకలు సాగిస్తున్నారు. గేటు వేసినా గేటు కింద నుంచి క్రాసింగ్‌లను దాటుతున్నారు. ఈ క్రమంలోనే రైల్వే లెవల్ క్రాసింగ్‌లను దాటుతున్న సమయంలో రెప్పపాటులో ప్రమాదాలు తప్పించుకున్న సంఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు గడువు అవసరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో నూతన పాఠశాలల వ్యవస్థలో భాగంగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుకోవడానికి వచ్చే ఏడాది వరకూ గడువు ఇవ్వాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. నూతన పాఠశాలల వ్యవస్థలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున నియమిస్తూ మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేశారని, ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 కంటే ఎక్కువ ఉండాలని నిబంధన విధించారన్నారు. వేసవి సెలవుల్లోనే ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించుకున్నారని, బదిలీలు అనంతరం కొత్తగా వెళ్ళిన ఉపాధ్యాయులకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పుకోవడానికి పిల్లలు లేరన్నారు. ఇప్పుడిప్పుడే ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు నియమించారన్న విషయాలను గ్రామ పెద్దలకు, గ్రామస్తులకు, తల్లిదండ్రులకు తెలియజేసి, ప్రైవేటు పాఠశాలల నుంచి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని, అందువల్ల మోడల్ ప్రైమరీ స్కూల్లో 60 పైబడి ఉండాలన్న నిబంధన/లక్ష్యం వచ్చే విద్యాసంవత్సం వరకు పొడించాలన్నారు. ఉపాధ్యాయులు కొత్తగా ఆయా పాఠశాలల్లో ఈ నెల 16న జాయిన్ అయ్యారని, అంటే వారు చేరి కేవలం పదమూడు రోజులు మాత్రమే అయ్యిందని, ఇంతలోనే పని సర్దుబాటు ద్వారా ఇప్పటి విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను ఉంచుతామన్న విధానం సరైంది కాదన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ముగ్గురు భక్తులు వేరువేరుగా ఆదివారం రూ. 3,11,351 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంనకు చెందిన దండుబోయిన వీరవెంకట సర్వేశ్వరరావు రూ.1,00,116, ఖమ్మం జిల్లా సత్యన్నారాయణపురంనకు చెందిన చాపలమడుగు దానేశ్వరరావు రూ.1,00,116, ఏలూరుకు చెందిన మారుశీళ్ల కృష్ణారావు రూ.1,11,119 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాలను అందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

గుంతల రోడ్డుపై వరి నాట్లు



పెదలంక రోడ్డుపై నాట్లు వేస్తున్న సీపీఎం నాయకులు

కలిదిండి(కైకలూరు): గుంతల రహదారికి మరమ్మత్తులు చేయాలంటూ సీపీఎం నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. కలిదిండి మండలం మూలలంక నుంచి పెదలంక రోడ్డును వెంటనే నిర్మించాలంటూ ఆదివారం పెదలంక వరి నాట్లు వేశారు. సీపీఎం కలిదిండి ప్రాంతీయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు మాట్లాడుతూ పాడైపోయిన రోడ్లు మొత్తం బాగు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. మూలలంక– పెదలంక రోడ్డు గుంతల మయంగా మారి అత్యంత ప్రమాదకరంగా ఉందన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



ఏఐటీయూసీ సమావేశంలో నినాదాలు చేస్తున్న సంఘ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏలూరు ఏరియా అధ్యక్షుడు కే.కృష్ణమాచార్యులు, జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం స్థానిక స్ఫూర్తి భవనంలో ఏఐటీయూసీ ఏలూరు ఏరియా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ గత మే 20న జరగాల్సిన దేశవ్యాప్త సమ్మె యుద్ధ వాతావరణం వల్ల వాయిదా పడిందని గుర్తు చేశారు. తిరిగి జూలై 9న జరుగుతుందని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్వం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కి 4 లేబర్ కోడ్‌లుగా మార్చిందన్నారు. కార్మిక సంఘం పెట్టుకునే హక్కు నుంచి, వేతన ఒప్పందాల వరకు యజమానులకు అనుకూలంగా, కార్మికులకు కఠినతరంగా లేబర్ కోడ్లు ఉన్నాయని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యావత్తు కార్మిక వర్గం సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక సమస్యలే కాకుండా రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సమస్యలపై జరుగుతున్న ఈ సమ్మెలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ.అప్పలరాజు, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, జిల్లా నాయకులు పి.కిషోర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్ మాట్లాడారు. సమావేశంలో ఏరియా నాయకులు బరగడ పోతురాజు, ఎలగాడ శివకుమార్ , పుప్పాల శ్రీనివాస్, బోడెం వెంకట్రావు, వీ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మతల్లి గుడికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

కైకలూరు: ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలిపై దాడి చేసి 6 కాసుల బంగారాన్ని కాజేసిన ఘటన కైకలూరు మండలం రామవరంలో శనివారం రాత్రి జరిగింది. కైకలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుడూరు నాగలక్ష్మీ(62) భర్త మరణం తర్వాత ఒంటరిగా నివసిస్తోంది. ఇద్దరు వ్యక్తులు రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లోకి ప్రవేశించి తలకు గుడ్డ కట్టి బలవతంగా మెడలో తాడు, రెండు బంగారు గాజులు లాక్కుని పరారయ్యారు. పెనుగులాటలో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్, ఎస్ఐ రాంబాబులు క్లూస్ టీంతో పరిశీలన చేశారు. తెలిసిన వారే ఈ దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

అప్పులు తప్ప హామీల అమలేదీ?



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

భీమవరం: కూటమి ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యమని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. భీమవరంలో ఆదివారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. రాష్ట్రంలో ఉన్నది డబుల్ ఇంజిన్ కాదని, ట్రబుల్ ఇంజిన్ అని విమర్శించారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో పాలనను సూపర్ ఫ్లాప్ చేశారని, ప్రజలకు గ్యాస్ సిలిండర్ ఒక్కటిచ్చి పథకాలన్నీ అమలు చేశామని చెబుతున్నారని దుయ్యబట్టారు. తల్లికి వందనం పథకం కింద 20 లక్షల మంది పిల్లలను మోసం చేశారని మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అన్నదాత దుఃఖీభవ చేశారని విమర్శించారు. ప్రజలకు ఈ ఏడాది కాలంలోనే రూ.1.50 లక్షల కోట్ల అప్పులు మిగిల్చారన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి పాలక్ వర్మ, జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమారరాజు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటింటికీ ఉచిత వైద్యం



వృద్ధుడికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్యం కార్యక్రమంలో భాగంగా ఇంటికే పరిమితమైన వృద్ధులకు సీనియర్ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య వృద్ధులకు వైద్య సేవలు అందించారు. తణుకు పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక వాహనం ద్వారా పర్యటించి ఆరుగురు వృద్ధులకు వైద్యం చేశారు. సభ్యులు పరిమి సూర్యనారాయణ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ చైర్ పర్సన్ శ్రీరామ్ సురేష్

అత్తిలి: పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని, ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి క్లబ్ అభివృద్ధికి కృషి చేయాలని లయన్స్‌క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ మేకా శ్రీరామ్ సురేష్ అన్నారు. ఆదివారం అత్తిలి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో లయన్స్ క్లబ్ సేవలు అద్వితీయమని, నూతన కార్యవర్గం క్లబ్ సేవలను విస్తృత పరచాలని కోరారు. పాస్ట్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షుడిగా శిరగాని నాగేశ్వరరావు, కార్యదర్శిగా చిట్టాల బాల మురళీకృష్ణ ప్రసాద్, కోశాధికారిగా వర్ధినీడి వెంకటశివతో పాటు పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జోన్‌చైర్‌పర్సన్ పటాన్నల వెంకటేశ్వరరావు, కేవీవీ సత్యనారాయణ, వంకా రాజకుమారి, సీతాల వెంకట నారాయణ, శింగులూరి చంద్రశేఖర్, ఉలుసు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీ కోసం) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలనుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులను అందించాలని కోరారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

పాలకొల్లు సెంట్రల్: నేటి సమాజంలో విద్యను వ్యాపారం చేసేయడంతో పేద మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో విద్యా వ్యవస్థపై మాట్లాడుతూ విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రైవేటు స్కూల్, కాలేజీల్లో ఫీజులు నియంత్రించాలని అలాగే ఫీజులు బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో యూనిఫార్ములు, పుస్తకాలు విక్రయాన్ని అరికట్టాలన్నారు. విద్యా వ్యవస్థలో ఎన్ని చట్టాలు, ఎన్ని జీఓలు తీసుకువచ్చినా అవన్నీ ప్రైవేటు విద్యాసంస్థల ముందు బలాదూర్ అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం విద్యను అమలు చేయాలని అన్నారు. అమలు చేయని విద్యా సంస్థల అనుమతులను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో కుల గణన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రామలింగేశ్వరుని మాడ వీధుల పరిశీలన

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సప్త సోమవారాలు ప్రదక్షిణల్లో భాగంగా భక్తులు ప్రదక్షిణలు చేసే మాడ వీధులను ఆదివారం అధికారులు పరిశీలించారు. సోమవారం సాయంత్రం ప్రదోష కాలంలో ఈ ప్రదక్షిణలు ప్రారంభిస్తున్నారు. గత మూడు సోమవారాలు ప్రదక్షిణల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నాలుగో సోమవారం వేలమంది పాల్గొనే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

వర్షాకాలం.. వ్యాధుల భయం

- జ్వరాలు మొదలు కావడంతో బెంబేలెత్తుతున్న ప్రజానీకం
- చిన్నారుల్లో కనిపిస్తున్న జ్వరాలు
- వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ
- అపరిశుభ్ర వాతావరణ పరిస్థితులపై ఆందోళన
- ఇప్పటికే ప్లేట్ లెట్స్ కౌంట్ తగ్గుతున్న వైనం


జిల్లా కేంద్ర ఆసుపత్రిలో జ్వరంతో చికిత్స పొందుతున్న చిన్నారులు (ఫైల్)

తణుకు అర్బన్: వానలు పడుతుండడంతో వేసవి మండుటెండల నుంచి ఉపశమనం కలిగిందనుకుంటే ఇక సీజనల్‌గా వచ్చే జ్వరాల కేసులు మొదలవడంతో ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తోంది. ఇప్పటికే వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వచ్చి ఉష్ణోగ్రతలు తగ్గడంతో చిన్న పిల్లల్లో జ్వరం కేసులు మొదలయ్యాయి. వర్షాలకు వీధుల్లో నిల్వ ఉండే మురుగు నీరు కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇళ్లలో సైతం కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. వ్యాధులకు మూల కారణం వర్షాలతో నీరు కలుషితమవడమే. ఎక్కువ శాతం రోగాలు నీటితో పాటు అపరిశుభ్ర వాతావరణంలో దోమల వ్యాప్తితో విజృంభిస్తాయని వైద్యులు చెబుతున్నారు. కలుషిత నీరు తాగడం వలన, సూక్ష్మ క్రిములను చేరవేసే దోమ కాటుతో ఎన్నో రకాల జ్వరాలు వస్తుంటాయి. కలుషిత నీరు సేవించడం, దోమలు కుట్టడం వంటి కారణాలతో జలుబు, జ్వరం, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామెర్లు, చికున్‌గున్యా వంటి వ్యాధుల ఉధృతి పెరిగే అవకాశం ఉంది. ఈ వ్యాధులకు సంబంధించిన ఎటువంటి లక్షణాలు కనిపించినా వెంటనే సమీపంలోని వైద్యుడిని ఆశ్రయించాలని వైద్యాధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు ఈ సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం అధికంగా ఉంటుందని వైద్యాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం టైఫాయిడ్ జ్వరం కేసులు కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

టైఫాయిడ్

కలుషిత ఆహారం, నీరు ద్వారా సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుంది. విడవకుండా జ్వరం రావడం, 103 నుంచి 104 డిగ్రీల వరకు తీవ్రమైన జ్వరం వస్తుంది. వాంతులు, విరేచనాలు, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం టైఫాయిడ్ లక్షణాలు.

దోమల ద్వారా డెంగీ

కేవలం దోమ ద్వారా మాత్రమే వచ్చే వ్యాధి డెంగీ. స్వచ్ఛమైన నీటిలో తిరుగుతూ పగటిపూట మాత్రమే కుట్టే దోమ ఇది. ఈ దోమ కుట్టిన 2నుంచి 7 రోజుల మధ్య డెంగీ లక్షణాలు కనిపిస్తాయి. వణుకుతో జ్వరం రావడం, తీవ్రమైన తలనొప్పి, ఒంటి నొప్పులతో పాటు కీళ్లు, కండరాల నొప్పులు, నోరు చేదు, ఆకలి మందగించడం, ఛాతీపై ఎర్రటి మచ్చలు రావడం, తీవ్ర స్థాయికి చేరినప్పుడు రక్తంలో ఉండే ప్లేట్‌లెట్ కణాల సంఖ్య తగ్గిపోవడం, రక్తపు వాంతులు, నల్లని విరేచనం డెంగీ లక్షణాలుగా వైద్యారోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

మలేరియా లక్షణాలు

ప్లాస్మోడియం జాతి సూక్ష్మ క్రిముల వలన ఎనాఫిలస్ దోమ కాటు ద్వారా మలేరియా వ్యాపిస్తుంది. ఈ దోమ కుట్టిన వ్యక్తి రక్తంలోకి ప్రవేశించిన సూక్ష్మ క్రిములు కాలేయాన్ని చేరుకుంటాయి. కాలేయ కణాల్లోకి చొచ్చుకెళ్లి సంతానాన్ని వృద్ధి చేసి మలేరియా వ్యాధిని కలిగిస్తాయి. వస్తూ పోయే జ్వరం, కడుపులో అసౌకర్యం, చలితో వణుకు, కొంత సేపటికి చెమటలు, కొన్ని సందర్భాల్లో మూత్ర పిండాల వైఫల్యం కూడా కనిపిస్తుంది.

కామెర్లు

కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా వచ్చే వ్యాధి కామెర్లు. ఇది హెపటైటీస్-బి, హెపటైటీస్-సి వంటి ఇన్‌ఫెక్షన్లతో కామెర్లు రావొచ్చు. కళ్లు, చర్మం పసుపు పచ్చగా మారడం, రక్తంలో బిలురుబిన్ స్థాయి పెరగడం, శరీరంలోని సున్నితమైన చర్మం పచ్చబడడం, ఆకలి మందగించడం, జ్వరం, గొంతు నొప్పి, మూత్రం పచ్చగా రావడం, మలం తెలుపు, నలుపు రంగులోకి మారడం, కడుపు నొప్పి, బలహీనత వంటి లక్షణాలు.

నీళ్ల విరేచనాలు (డయేరియా)

బ్యాక్టీరియా వైరల్, పరాన్న జీవుల ఇన్‌ఫెక్షన్ మూలంగా నీళ్ల విరేచనాలు వస్తాయి. రోజుకు మూడు అంతకన్నా ఎక్కువగా నీళ్ల విరేచనాలు అయితే డయేరియాగా గుర్తించొచ్చు. ఈ వ్యాధి వలన ఒంట్లో ఉండాల్సిన నీటి శాతం తగ్గిపోయి ముఖ్యమైన లవణాలు బయటకు పోతాయి. వెంటనే భర్తీ కాకపోతే డీ హైడ్రేషన్‌కు దారి తీస్తుంది.

వ్యాధుల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలు

- ఆహారం, నీరు కలుషితం కాకుండా కాచి చల్లార్చిన నీరు వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి.
- మల మూత్ర విసర్జన అనంతరం చేతులు శుభ్రపరచుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలి.
- దోమల వ్యాప్తిని అరికట్టాలి.
- చిన్న పిల్లలకు ఒంటిని పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి.
- ఇళ్లలో దోమతెరలు, కిటికీలకు మెస్‌లు ఏర్పాటుచేసుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో కొబ్బరి బొండాలు, పాత టైర్లు, డ్రమ్ములు ఉంచకూడదు.
- మలేరియా ప్రబలిన ప్రాంతాల్లో యాంటీ మలేరియా మందులు వైద్యుల సూచనల మేరకు వాడాలి.
- పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తరువాత తినాలి.
- కామెర్ల లక్షణాలు కనిపిస్తే అది ఏ రకం కామెర్లు అనే విషయం తెలుసుకునేందుకు వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

నగదు బదిలీ వద్దు.. రేషన్ కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నగదు బదిలీ వద్దని, రేషన్ మాత్రమే కావాలని సీపీఎం నాయకులు సిరపరపు రంగారావు, బంకూరు నాగేశ్వరరావు, చిర్ల పుల్లారెడ్డి పేర్కొన్నారు. సీపీఎం పెంటపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పెంటపాడు ప్రజా సంఘాల కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో 1.46 కోట్ల మందికి రేషన్ కార్డులు ఉన్నాయని, కూటమి ప్రభుత్వం రేషన్ వద్దన్న వారికి నగదు బదిలీ చేస్తామని, వికలాంగులకు, వృద్ధులకు ఇంటికి వెళ్లి రేషన్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. అయితే ఈ పథకాన్ని ప్రభుత్వం ఎత్తివేయడానికి చూస్తుందని విమర్శించారు. గతంలో రేషన్ కార్డు ద్వారా 14 రకాల వస్తువులు ఇచ్చేవారని, నేడు సరుకులు తగ్గించి, ఇప్పుడు మనిషికి 5 కేజీల బియ్యం, అర కేజీ పంచదార ఇస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం ఇస్తున్నారని, మరో పక్క కేరళలో 16 రకాల నిత్యావసర వస్తువులు ఇస్తున్నారని, మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. బర్ల బాలాజీ, పెనగన దుర్గారావు, మీసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులతో సమాజంలో చైతన్యం


కళా సత్కారం నిర్వహిస్తున్న రంగస్థల కళాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కళాకారుల ద్వారా సమాజంలో చైతన్యం కలుగుతుందని, వారు బాగుంటేనే సమాజం సుభిక్షంగా ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 157వ నెలవారీ సభా కార్యక్రమం స్థానిక నందిబొమ్మ కూడలి శ్రీవిఘ్నేశ్వర రామాలయంలో నిర్వహించారు. హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగి శ్రీనివాసరావుకు గౌరవ సత్కారం, విశ్రాంత కార్యనిర్వాహక ఇంజనీర్, గాయకుడు తాడూరి వెంకట శేషగిరిరావుకు కళా సత్కారం, ఉద్యోగ సేవా పురస్కారం రామచంద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీబీ యూనిట్ పర్యవేక్షకుడు పెమ్మరాజు సురేష్‌కు ఉద్యోగ సేవా పురస్కారం అందజేశారు. నృత్య కళాకారుడు జూనియర్ నాగార్జునకు ఆర్థిక సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, దేవికారాణి, జేజే కృష్ణ, మాసా బాబూరావు, శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

క్లాత్ సంచులు వాడండి


క్లాత్ సంచులు విడుదల చేస్తున్న శ్రీకృష్ణదేవరాయ సేవా సంఘం సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లను వీడాలని, క్లాత్ (గుడ్డ) సంచులు వాడాలని శ్రీకృష్ణ దేవరాయ సేవా సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ అన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు నంద్యాల కృష్ణమూర్తి సౌజన్యంతో ఆదివారం సంతలోకి వచ్చిన వినియోగదారులకు రెండు వేల మందికి సంఘం ఆధ్వర్యంలో తయారు చేయించిన క్లాత్ బ్యాగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం మానాలని, క్లాత్, జూట్ బ్యాగ్‌లు ముద్దు అన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన వచ్చే అనర్థాలను ప్రజలకు వెల్లడించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను విడనాడి పురపాలక సంఘానికి సహకరిద్దామన్నారు. ప్లాస్టిక్ వాడకం తిరస్కరిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి మూర్తి, కోశాధికారి వట్టిపులుసు సత్యనారాయణ, గంధం వెంకట రాజశేఖర్, పొప్పుప్పుల కుమార్ స్వామి, గారపాటి వీర కుమార్, బాకా వెంకటేశ్వరరావు, పాలూరి సత్యనారాయణ, పేటేటి రాము, ఆచంట కోటేష్, చేవూరి మధుసూదన్, పాలూరి విశ్వేశ్వరరావు, ఆవుల శ్రీనివాస్, రాట్నాల సత్యనారాయణ, కాశీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నిరంతరం పుస్తక పఠనం చేయాలి


గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు నిరంతరం పుస్తక పఠనం చేయాలని రిసోర్స్ పర్సన్లు పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ అధికారుల ఆదేశాల మేరకు స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ప్రతి ఆదివారం చదువు అంటే మా కిష్టం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. రిసోర్స్ పర్సన్ గరికపాటి బాపయ్య శర్మచే వేసవి కాలం, రోహిణీ కార్తె, నైరుతి రుతు పవనాలపై మధ్య సంబంధాల గురించి అవగాహన కల్పించారు. బ్రిటీష్ కాలం నుంచి విద్యార్థులకు 50 రోజుల పాటు వేసవి సెలవులు ఎందుకు ఇస్తారనే అంశం, కోర్టుకు సెలవులు ఎందుకు ఇస్తారనే అంశాలపై ఆసక్తికరమైన చర్చ కొనసాగింది. విద్యార్థులతో పాటు రిసోర్స్ పర్సన్లు ఎ.సత్యనారాయణ, పి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం



విజయ చాముండేశ్వరీదేవి అమ్మవారు, అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అత్తిలి: స్థానిక పడవల రేవులో స్వయంభుగా వెలసిన శ్రీవిజయ చాముండేశ్వరీ దేవి అమ్మవారి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. విజయ చాముండేశ్వరీ దేవి అమ్మవారి గుడి దగ్గర నుంచి పసుపు, కుంకుమ, చలివిడి, పానకం, సారి, పాలు, పసుపు నీళ్లు, జలం కావళ్లతో అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం తేతలి వాస్తవ్యులు, వాడపల్లి శశికాంత్ ఆచార్యుల ఆధ్వర్యంలో వేద పారాయణం నిర్వహించారు.

కోమటిగుంటలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు


కోమటిగుంటలో వాకింగ్ ట్రాక్ పనులు జరుగుతున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కోమటిగుంటలో ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. గ్రామంలో చెరువు తవ్వి, చుట్టూ ట్రాక్ ఏర్పాటు చేసి ఆహ్లాదకర వాతావరం కోసం మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామ సర్పంచ్ బోణం భాగ్యశ్రీ శివకుమార్ ట్రాక్ ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామంలో ఎక్కడా మురుగు లేకుండా, పంటకాలవలు కాలుష్యం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.

సమస్యల వలయంలో పెదపేట


స్థానిక పెదపేటలో చెత్త పేరుకుపోయిన దృశ్యం


స్థానిక పెదపేటలో అధ్వానంగా పైపులైన్లు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పట్టణ నడిబొడ్డున ఉన్న పెదపేటలో సమస్యలు తిష్ట వేశాయి. దుక్కి వర్షానికే ఆ ప్రాంతంలోని పల్లపు ప్రాంతాలు నీట మునిగిపోతున్నాయి. డ్రెయినేజీలో చెత్త, మట్టి తొలగింపులో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. పెదపేటకు చేర్చి ఉన్న గంగానమ్మకోడు డ్రెయినేజీలో చెత్త పేరుకుపోవడంతో మురుగు నీరు నిలబడిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. డ్రెయిన్‌కు చేర్చి చెత్తాచెదారం వేయడంతో ఆ ప్రాంతం అపారిశుద్ధ్యానికి నిలయంగా మారింది. పెదపేటలో పైప్‌లైన్ల విస్తరణ అధ్వానంగా ఉంది. అంగుళం పైపులైన్‌తో 200, 300 మీటర్లకు పైగా దూరం నుంచి కుళాయి నీరు పొందాల్సి వస్తుందని వాపోతున్నారు. కుళాయి నీరు కూడా సక్రమంగా అందడంలేదంటున్నారు. పైప్‌లైన్‌ల పునర్నిర్మాణానికి అమృత పథకం నిధులు వెచ్చిస్తామని గతంలో కమిషనర్ వెల్లడించినా పనులు మాత్రం జరగలేదు. పట్టణ నడిబొడ్డులో మంచినీటి సమస్య వేధిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళిత పేట ప్రాంతాల్లో వెచ్చించాల్సిన నిధులు సక్రమంగా వినియోగించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. పెదపేటలోని సమస్యల పరిష్కారానికి నిధులు వెచ్చించాలని వారు కోరుతున్నారు.

ముగిసిన మావుళ్లమ్మ జాతర

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారికి తొలుత భారీ కుంభం నైవేద్యంగా సమర్పించారు. పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కపిల మల్లేశ్వరస్వామి దర్శనానికి అవస్థలు

నరసాపురం: పట్టణంలోని శ్రీ కపిలమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద పడగొట్టిన మెట్లు తిరిగి కట్టకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రసిద్ధ ఈ శివాలయానికి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇటీవల గుడి ఎదురుగా ఉన్న డ్రెయిన్ మరమ్మతులు చేశారు. మరమ్మతుల్లో భాగంగా గుడిమెట్లను తొలగించారు. తొలగించిన మెట్లు తిరిగి నిర్మించలేదు. ఆలయ అధికారులు కూడా మున్సిపాలిటీకి ఫిర్యాదు చేయడం గానీ, డ్రెయిన్ పై నుంచి గుడి లోపలికి వెళ్లే విధంగా ఉన్న మెట్లను తిరిగి నిర్మించే విషయంలో చర్యలు చేపట్టలేదు. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.